andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
నిజామాబాద్ జిల్లా వార్తలు
5
గురువారం 11 ఏప్రిల్ 2024



1726 ఎకరాల్లో పంట నష్టం



టాక్లీ శివారులో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

- జిల్లాలో వడగండ్లతో దెబ్బతిన్న పంటలు
- అత్యధికంగా నేలరాలిన వరి పంట
- వివరాలు సేకరించిన అధికారులు

నిజామాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో అకాల వర్షాల వల్ల పంటలకు భారీ నష్టం జరిగింది. ఒకేసారి వడగండ్లు పడటంతో రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1726 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. పంట చేతికొచ్చే దశలో వడగండ్లు పడటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షంతో పాటు వడగండ్లు పడటం వల్ల చేతికొచ్చిన వరి నేలరాలింది. దెబ్బతిన్న పంట పొలాలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతనెలలోనే వడగండ్లకు పంట ఎక్కువ మొత్తంలో దెబ్బతినగా ఈ నెలలో కూడా మళ్లీ పడటంతో రైతులు ఎక్కువ మొత్తంలో నష్టపోయారు. బాధిత రైతులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని పలు పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

బోధన్ డివిజన్‌లో నేలరాలిన పంట

జిల్లాలో సోమవారం కురిసిన వడగండ్ల వర్షం వల్ల బోధన్ డివిజన్ పరిధిలో చేతికొచ్చిన వరిపంట నేలరాలింది. పెద్ద మొత్తంలో పంటకు నష్టం జరిగింది. ఒకేసారి రాత్రివేళలో వడగండ్లు పడటంతో పంట ఎక్కువ మొత్తంలో దెబ్బతింది. వరితో పాటు జవార్, మామిడి పంట కూడా కొంత మేర నష్టం జరిగింది. ఇదే కాకుండా కూరగాయల పంటలు కూడా దెబ్బతిన్నాయి. రాళ్లు పడటం వల్ల ఎండిన గొలుసు నేలరాలడం వల్ల రైతులకు ఎక్కువ నష్టం జరిగింది. పంటలు చేతికొచ్చే సమయంలో వడగండ్లు పడటం వల్ల పెద్ద ఎత్తున నష్టపోయామని రైతులు వాపోతున్నారు.



పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్

30శాతం కంటే నష్టం వివరాల సేకరణ

జిల్లాలో పడిన వడగండ్ల వల్ల మొత్తం 1726 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 30 శాతంకంటే ఎక్కువ మొత్తంలో నష్టం జరిగిన పంట వివరాలను సేకరించారు. ఆయా గ్రామాల వారీగా సర్వే నెంబర్లను గుర్తించి ప్రాథమిక అంచనాకు వచ్చారు. జిల్లాలో వడగండ్ల వల్ల ఎక్కువ మొత్తంలో వరిపంటకు నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

పోతంగల్‌లో అత్యధికంగా 463 ఎకరాలు

జిల్లాలోని వర్ని మండలంలో వడగండ్ల వల్ల 101 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. మోస్రాలో 90 ఎకరాలు, చందూర్‌లో 425 ఎకరాలు, రుద్రూర్‌లో 15 ఎకరాలు, కోటగిరిలో 66 ఎకరాలు, పోతంగల్‌లో అత్యధికంగా 463 ఎకరాలు, బోధన్‌లో 150 ఎకరాలు, సాలూరా మండలంలో 326 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. జిల్లాలో 861 మంది రైతులకు చెందిన 1640 ఎకరాల్లో ఈ పంటకు నష్టం జరిగినట్లు అంచనా వేశారు. జిల్లాలో జవార్ పంట 4 ఎకరాల్లో, మామిడి 60 ఎకరాల్లో, బొప్పాయి 12 ఎకరాల్లో, బీరా 3 ఎకరాల్లో, ములక్కాయ 6 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. రైతుల సర్వే నెంబర్ ఆధారంగా వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదించారు. జిల్లాలో గత నెలలో కూడా ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ మండలాల్లో వడగండ్ల వర్షానికి పంటలు దె బ్బతిన్నాయి. ఆ సమయంలో ప్రభుత్వం మీద అధికారులను పంపించి పరిశీలించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా వచ్చి పరిశీలించారు. రైతులను ఆదుకుంటామని ప్రకటించారు. అదేరీతిలో బోధన్ డివిజన్ పరిధిలో దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని సీపీఎం నేతలతో పాటు ఇతర పార్టీల నేతలు డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు 25వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. జిల్లాలో వడగండ్లకు దెబ్బతిన్న ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించి పూర్తిస్థాయిలో వివరాలను సేకరించారని జిల్లా అధికారి వాజీద్ హుస్సేన్ తెలిపారు. సాలూరాతో పాటు ఇతర మండలాల్లో ఆయన పర్యటించి పంటలను పరిశీలించారు. ప్రాథమిక నివేదికను కలెక్టర్‌కు అందిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వానికి కూడా ఈ నివేదికను పంపిస్తామని ఆయన తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- వీసీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

నిజామాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి. ఎక్కడైనా సమస్యలు ఏర్పడితే సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో తాగునీటి సరఫరా, ధాన్యం కొనుగోళ్లు, పాఠశాలల్లో మౌలిక వసతులు, వడదెబ్బ నివారణ వంటి అంశాలపై బుధవారం సమీక్షించారు. జిల్లాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణాల్లో, శివారు కాలనీలో కూడా తాగునీటి ఎద్దడి తలెత్తితే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని ప్రధాన కార్యదర్శి ఆదేశాలు ఇచ్చారు. రానున్న రెండు నెలల పాటు పూర్తిస్థాయిలో తాగునీటిపై దృష్టి పెట్టాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆమె ఆదేశాలు ఇచ్చారు. రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చూడాలన్నారు. రైతులకు చెల్లింపులు కూడా వెంట వెంటనే చేయాలన్నారు. వానాకాలం 2023-24 సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరీ వేగవంతం చేయాలన్నారు. ఎఫ్‌సీఐకి నిర్దేశించిన సమయానికి బియ్యాన్ని అందించాలన్నారు. అన్ని రైస్‌మిల్లులు పూర్తిస్థాయిలో నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అలాగే జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పన కింద చేపట్టిన పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రతి మండలంలో ఈ పనులను పర్యవేక్షించడానికి ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీని నియమించాలన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు పనులన్నీ పూర్తి చేయాలన్నారు. అలాగే రాష్ట్రంలో ఎండలు భారీగా పెరిగాయన్నారు. వడదెబ్బ తగలకుండా అన్ని చర్యలను జిల్లా స్థాయిలో చేపట్టాలన్నారు. అన్ని కేంద్రాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందించాలన్నారు. ఉపాధి హామీ పనులను ఉదయం పూటనే నిర్వహించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ ఐఏఎస్ కిరణ్మయి, జేడీఏ వాజిద్ హుస్సేన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రాజేందర్, జడ్పీ సీఈవో ఉషా, డీఎంహెచ్‌వో సుదర్శనం, డీఎస్‌వో చంద్రప్రకాశ్‌తో పాల్గొన్నారు.



- ముగిసిన ఇఫ్తార్ విందులు
- జిల్లాలో ముస్తాబైన మసీదులు
- ప్రార్థనలకు సిద్ధమైన ఈద్గాలు
- నేడు రంజాన్

ఈద్ ముబారక్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 10: జిల్లాలో ముస్లింలు గురువారం రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పర్వదినాన్ని ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలోని ఈద్గా, మజీద్‌లను ముస్తాబు చేశారు. భక్తిశ్రద్ధలతో నెల రోజులపాటు చేపట్టిన ఉపవాస దీక్షలు 30వ రోజున ముగియడంతో మరుసటిరోజున రంజాన్ పండగను జరుపుకోనున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని ఖిల్లా ప్రాంతంలో ఈద్గా వద్ద, గాంధీచౌక్ కచ్చమసీద్, ధర్మపురి హిల్స్, మదీనా తదితర ప్రాంతాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.

ముస్లిం సోదరులకు ప్రముఖుల శుభాకాంక్షలు..

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాకు చెందిన ప్రముఖులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ స్పీకర్ పోచారం, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేష్‌రెడ్డి, ఎంపీలు ధర్మపురి అర్వింద్, సురేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, అంకిత్ తదితరులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్‌ను జరుపుకోవాలని వారు సూచించారు.





- నగరంలోని ఖిల్లా ఈద్గాలో ప్రార్థనల కోసం ఏర్పాట్లు



- ఆర్మూర్‌లో ఈద్గా వద్ద ఏర్పాట్లు





ఆసుపత్రిలో చేరిన డీఎస్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 10: సీనియర్ నాయకుడు మాజీ పీసీసీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ అనారోగ్య కారణంగా హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మూత్రనాళాల ఇన్ఫెక్షన్ కారణంగా ఆయనను ఆసుపత్రిలో చేర్పినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆయన తనయుడు పార్లమెంట్ సభ్యుడు అర్వింద్ సోషల్ మీడియాలో తన తండ్రి ఆసుపత్రిలో ఉన్నట్లు పోస్ట్ చేశారు. దీంతో ఆయన అభిమానులు ఆయన యోగక్షేమాలను తెలుసుకుంటున్నారు.





- విపరీతంగా పెరిగిన చికెన్ ధరలు
- కిలో రూ.320 పలుకుతున్న స్కిన్‌లెస్ చికెన్ ధర
- కోళ్ల ఫారాల్లో తగ్గిన ఉత్పత్తి
- పెరిగిన డిమాండ్‌తో కోడి ధరలకు రెక్కలు

కొండెక్కిన కోడి మాంసం

బోధన్ రూరల్, ఏప్రిల్ 10: జిల్లాలో కోడి మాంసం ధరలు కొండెక్కుతున్నాయి. రోజురోజుకూ ధరలు చుక్కలనంటుతున్నాయి. వారం రోజుల్లో చికెన్ ధర కిలోకు 50 రూపాయలకు పైగా పెరిగింది. కోళ్ల ఉత్పత్తి తగ్గడం, డిమాండ్ పెరగడమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో చాలా కోళ్లు చనిపోతున్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. ఆదివారం కిలో స్కిన్‌లెస్ చికెన్ ధర ఏకంగా 320 రూపాయలు పైనే పలికింది. దీంతో కేజీ కొనాలనుకున్న వారు వెనక్కి తగ్గి అరకిలోతో సరిపెట్టుకున్నారు. ఎండాకాలంలో చికెన్ ధరలు కొన్నేళ్లుగా పెరుగుతూ వస్తున్నాయి. పెళ్లిళ్లు, శుభకార్యాలు ఉండటంతో చికెన్ ధర ఆకాశాన్ని అంటుకుంటుంది. కాగా, వేసవిలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల కోళ్ల పెంపకం తగ్గడం వల్లే కోళ్ల కొరత ఏర్పడి ధరలు పెరిగాయని, కోళ్ల దాణాకు ఉపయోగించే మొక్కజొన్న, సోయా ధరలు గణనీయంగా పెరగడంతో ఉత్పత్తి వ్యయం ఎక్కువైందని అందుకే కొత్తగా పిల్లలను పెంచడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. రంజాన్ పండుగ సందర్భంగా హోటళ్లలో ప్రతిరోజూ చికెన్ హరీస్ వంటి పదార్థాలు తయారు చేసి అమ్మడంతో చికెన్ ధర ఒక్కసారిగా పెరిగింది.

చికెన్ ధర విపరీతంగా పెరిగింది..

: లక్ష్మి, గృహిణి (బోధన్)



చికెన్ ధర విపరీతంగా పెరగడంతో చికెన్ కొనలేకపోతున్నాం. ఆదివారం మాంసం తినాలనే కోరిక ఉన్నప్పటికీ కొనలేని పరిస్థితి నెలకొంది. నిత్యం ధరలు ఇలా పెరుగుతుంటే చికెన్ ఎలా కొనేది.



గ్రంథాలయాలు ఆధునిక విజ్ఞాన భాండాగారాలు

బోధన్‌రూరల్,ఏప్రిల్10: గ్రంథాలయాలు ఆధునిక విజ్ఞాన భండాగారాలు అని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ప్రతినిధులు అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని శాఖ గ్రంథాలయానికి రెండు కూలర్లను అందజేశారు.ఈ సందర్భంగా లయన్స్ ప్రతినిధులు మాట్లాడుతూ నిరుద్యోగ యువత కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ వేయడంతో గ్రంథాలయానికి అధిక సంఖ్యలో వస్తున్నారని, ఎండ వేడిమిలో ఉపశమనం కోసం కూలర్లను అందజేశామన్నారు. గ్రంథాలయాల్లో ఆధునిక పుస్తకాలతో బాగా చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు యార్లగడ్డ శ్రీనివాస్ రావు, వెంకటేశ్వర్ రావు, రాధాకృష్ణ మూర్తి, శ్రీనివాస రాజు, లక్ష్మీకాంత్ రెడ్డి, గాంధీ, హరిబాబు, ఐఆర్ చక్రవర్తి, రమణ రెడ్డి, నర్సారెడ్డి, గ్రంథాలయ పాలకులు రమా, సిబ్బంది తదితరులున్నారు.


గ్రంథాయానికి కూలర్లు అందజేస్తున్న దృశ్యం

ఆరోగ్యమే మహాభాగ్యం

● జిల్లా కోర్టులో ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

నిజామాబాద్ లీగల్, ఏప్రిల్ 10: జిల్లా కోర్టు ఆవరణలో న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం న్యాయసేవా సంస్థ చైర్‌పర్సన్, ప్రధాన న్యాయాధికారిణి సునీత కుంచాల ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని మన ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు చిన్న చిన్న పరీక్షలను చేసుకోవడంలో నిర్లక్ష్యం సరికాదని కనీసం సంవత్సరానికి రెండు సార్లైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, కంటి, పలు రకాల వైద్య పరీక్షలు డాక్టర్ నాగనాథ్ పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్‌బాబు, బార్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్, న్యాయసేవా సంస్థ సిబ్బంది, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్10: మున్సిపల్ పరిధిలోని గురువారం జరిగే రంజాన్ పండగ సందర్భంగా ముస్లీం సోదరీ సోదరీమణులకు మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్ దేవి లావణ్య శ్రీనివాస్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలని ఈ సందర్భంగా ససూచించారు.

పంటనష్ట పరిహారాన్ని చెల్లించాలి



మాట్లాడుతున్న రమేష్‌బాబు

పెద్దబజార్, ఏప్రిల్ 10: పంటనష్ట పరిహారాన్ని వెంటనే సర్వే నిర్వహించి చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా జిల్లాలో కురిసిన వడగండ్ల వానకు చేతికొచ్చిన వరి, మొక్కజొన్న పంట నేలకొరిగి గింజలు రాలిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. అదేవిధంగా వర్షాభావ పరిస్థితుల మూలంగా ఎండిపోయిన పంటలను వ్యవసాయ అధికారులు వెంటనే సర్వేలు నిర్వహించి పరిహారాన్ని లెక్కకట్టి రైతులకు ఎకరానికి 25వేలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెద్ది వెంకట్రాములు, నూర్జహాన్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

ముప్కాల్, ఏప్రిల్10: ముస్కు రాజ్‌కుమార్ ప్రథమ పుత్రిక ఆరాధ్యరెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం కిసాన్‌నగర్‌లోని సచికేతన్ ఆవాసంలో విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ మండల లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ముస్కు రాజేశ్వర్, సెక్రెటరీ కట్ట మహేష్, జక్కుల రాము, లింగపురం శ్రీనివాస్, సిద్ధ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవ పురస్కారం అందజేసిన జడ్పీచైర్మన్

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్10: పట్టణంలోని సవేరగ్యాస్ ఏజెన్సీలో విశ్వతేజస్ జాయింగ్ కౌన్సిలింగ్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవ పురస్కారాన్ని జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు భారత్‌గ్యాస్ సుమన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడుతూ గత 20ఏళ్ల నుంచి అనేక సమాజిక సేవలు చేస్తూ సిద్దులగుట్టలోని శివాలయం, రామాలయంతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసిన భారత్‌గ్యాస్ సుమన్‌కు ఉత్తమ సేవ పురస్కార అవార్డు అందజేయడం అభినందనీయ మన్నారు. అనంతరం పట్టుశాలువ పూలమాలతో సుమన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెజిషియన్ రంగనాథ్, మోటివేషనల్ స్పీకర్ సైకాలజిస్ట్ తిరునగరి శ్రీహరి, కళాకారులు, ప్రముఖ వైద్యులు, పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో చలివేంద్రం ప్రారంభం

నిజామాబాద్ లీగల్, ఏప్రిల్ 10:జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం జిల్లా జడ్జి సునీత కుంచాల చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారులకు, ప్రజలకు వేసవి కాలంలో దాహార్తిని తీర్చేందుకు వెలమ సంఘం ద్వారా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, వెలమ సంఘం అధ్యక్షుడు కిశోర్‌రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్, జీపీ శ్రీహరిఆచారి, మాజీ పీపీ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



రైలు కదిలిందా.. బతుకు గోవిందా!


రైలు కింద నుంచి ప్రమాదభరితంగా వెళ్తున్న పలు గ్రామాల ప్రజలు


రైలు పట్టాలను దాటుతున్న మహిళలు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 10: డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ నుంచి పక్కన గల ఘన్‌పూర్, ముల్లంగి, కులస్‌పూర్, గ్రామాలకు వెళ్లే గ్రామీణ ప్రజలు పలు శాఖాల్లో పనిచేసే అధికారులు పిల్లపాపలతో వెళ్లే గ్రామాల ప్రజలు నిత్యం ఆగి వున్న రైలు కింది నుంచి ప్రమాదకరంగా వెళ్తున్నారు. ఫుట్ ఓవర్ వంతెన లేక ఇలా ప్రమాదకరంగా వెళ్లడం ఈ గ్రామాల ప్రజలకు పరిపాటిగా మారింది. గత రెండు రోజులుగా మండల కేంద్రంలో రైల్వే స్టేషన్ లో రైలు నిలిపివుంచడంతో గ్రామీణ ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఇటీవల రైల్వే ఉన్నతాధికారులకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి పై గ్రామీణ ప్రజలు వినతి పత్రాలు అందజేసిన అధికారులు మాత్రం ఏలాంటి నిర్ణాయం తీసుకోకపోవడంతో రైల్వే అధికారులపై గ్రామస్థులు మండిపడుతున్నారు. వెంటనే వంతెన ఏర్పాటు కు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పెంచడం నరకడానికా..!

రుద్రూరు, ఏప్రిల్ 10 : రోడ్లకు ఇరువైపులా చెట్లు నాటాలన్న సదుద్దేశం తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెట్లను పెంచుతున్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది. పెద్దగా పెరిగిన చెట్లను విద్యుత్ తీగలకు తాకే ప్రమాదం ఉందని చెప్పి ఆ పెరిగిన చెట్లను నరికివేస్తున్నారు. ఏళ్ల తరబడి పెంచిన ఆ చెట్లను అప్పుడే నరికివేస్తు ండటంతో నీడ కరువవుతుందని పలువురు అంటున్నారు. అసలు చెట్లను నాటడం తప్పా, లేక పెరిగిన చెట్లను నరకడం తప్పా అనే విషయంపై పలువురు పల విధాలుగా చర్చించుకుంటు న్నారు. వాస్తవానికి చెట్లను పెంచాలే తప్పా తొలగించకూడదు. అధికారుల సమ న్వయ లోపంతో చెట్లకు రక్షణ కరువైంది. రుద్రూరు మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ కాలనీలో ప్రధాన రహదారిపై గత రెండు రోజులు క్రితం పచ్చని చెట్లను ట్రాన్స్ కో అధికారులు నరికివేశారు. విద్యుత్ వైర్లకు అడ్డుగా వస్తున్నాయనే ఉద్దేశంతో పచ్చని చెట్లను నరికి వేశారని కాలనీ వాసులు తెలిపారు. అంతేకాకుండా నరికి చెట్లను, చెట్ల కొమ్మలను ఇష్టానుసారంగా రోడ్లపైనే వేశారు. నీడనిచ్చే చెట్లు నేలకొరిగాయి. పచ్చని చెట్లను నేలకూల్చిన విద్యుత్ శాఖ అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఏదేమైనా పర్యావరణ సమతుల్యతకు చెట్లు నాటడం, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుంచుకోవాలని పలువురు పేర్కొంటున్నారు.


పెరిగిన పచ్చని చెట్లను నరికిన విద్యుత్ శాఖ అధికారులు

పసుపు పంటకు రూ.15వేల మద్దతు ధర కల్పిస్తాం


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్10: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పసుపు పంటకు రూ.15వేల కనీస మద్దతు ధర కల్పిస్తామని నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం వేల్పూర్ మండలం లక్కోరలోని ఎఎస్‌జీ గార్డెన్‌లో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రం కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడితే పంటలకు మద్దతు ధర కోసం జాతీయస్థాయిలో చట్టబద్ధత కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే బడుగు, బలహీనవర్గాలు, రైతుల సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ బడావ్యాపారవేత్తలకు కొమ్ముకాస్తున్నారని ఆయన విమర్శించారు. రైతులకు సంబంధించి రూ.2లక్షల కోట్ల రుణాన్ని మాఫీ చేయడకుండా బడావ్యాపారులకు రూ.16లక్షల కోట్ల మొండి బకాయిలు ఏలా మాఫీ చేశారని ప్రశ్నించారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే జాతీయస్థాయిలో రైతులకు ఉన్న రుణాలను మాఫీ చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ సంపాదించిన సంపాదనను నరేంద్రమోదీ గుజరాత్ వ్యాపారస్తులకు అమ్మేస్తున్నారని విమర్శించారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రధాని హామీ ఇచ్చి ఆరు నెలలైన ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదని అన్నారు. తమ నాయకుడు రాహుల్‌గాంధీ వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పిన ప్రకారం పసుపు పంటకు రూ.15వేల మద్దతు ధర కల్పిస్తామన్నారు. మెడిగడ్డలో అదనంగా పది టీఎంసీల నీటిని వృధాగా వదిలే బదులు అప్పటి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీకి మళ్ళీస్తే శ్రీరాంసాగర్‌లో నీటి కొరత ఉండేది కాదన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్రంలో ప్రాజెక్టులు నిర్మించామన్నారు. మతం పేరుతో నిర్మించే వారికి ఓటు వేయవద్దని కోరారు. గత పదేళ్ళ కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పటి సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అదోగతిపాలు చేశారని విమర్శించారు. రాష్ట్రాన్ని సరైన మార్గంలో నడిపించేది కాంగ్రెస్ మాత్రమేనని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ నాయకులు ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డి, తాహెర్‌బిన్‌హందాన్, మండవ వెంకటేశ్వర్‌రావు, అరికెల నర్సారెడ్డి, గడుగు గంగాధర్, మానాల మోహన్‌రెడ్డి, ముత్యాల సునీల్‌కుమార్, వినయ్‌రెడ్డి, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'నరేంద్రమోదీ వైపే దేశప్రజలంతా చూస్తున్నారు'



మాట్లాడుతున్న దినేష్‌కులాచారి

పెద్దబజార్, ఏప్రిల్ 10: ప్రధాని నరేంద్రమోదీ వైపే దేశప్రజలంతా చూస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు రెండు ఒక్కటేనని ఇందూరు ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. తెలంగాణలో ఎన్నికలు చూస్తుంటే కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్, సీపీఎం పార్టీలు ఏకమవుతున్నాయని కానీ గెలుపు మాత్రం బీజేపీకే సాధ్యమని ప్రజలు నిజాయితీకే పట్టం కడుతున్నారని ధీమావ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు సిద్ధాంతాలు లేవు. కేవలం మైనార్టీల ఓట్లే కావాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఒక మైనార్టీ నాయకులు మాట్లాడుతూ హైదరాబాద్ పార్లమెంట్ అనేది కాంగ్రెస్‌కు ఇచ్చామని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సాగునీరు, తాగునీరు కోసం రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే రూపాయి ఇచ్చింది లేదని విమర్శించారు. కాంగ్రెస్ నుంచి నిలబడ్డ జీవన్‌రెడ్డి ఇఫ్తార్ విందులో ఫోటోలకు ఫోజులు ఇస్తూ ఓట్లు మాకేనని చెప్పగానే చెబుతున్నారని అన్నారు. బాజిరెడ్డి గోవర్ధన్ కూడా టోపీలు పెట్టుకొని ఇఫ్తార్ విందులో పాల్గొంటున్నారని అన్నారు. బీజేపీ పార్టీకి కులం, మతం లేదని చిట్టచివరి వరకు అందరి కోసం పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి ఎన్నుకొని దాదాపు నాలుగు నెలలు కావస్తుందని నాలుగు నెలల్లో ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. రైతులు 1700 క్వింటాలుకు వడ్లను అమ్ముకొనే పరిస్థితి తలెత్తిందని రైతులు నష్టపోతున్నారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జిల్లాకు ఏం చేశారని దీని కోసం రోజు బహిరంగ సభ చర్చకు పిలిచిన మేము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. తాము గత ఎన్నికల్లో బాండ్ పేపర్ రాసిచ్చినట్టుగానే పసుపు బోర్డు తెచ్చామని అన్నారు. నేడు పసుపు ధర 20వేలు పలుకుతుందని అన్నారు. అలాగే నేడు 7ఆర్‌వోబీ బ్రిడ్జిలు సాంక్షన్ చేయించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గద్దెభూమన్న, శ్రీనివాస్‌శర్మ, వెంకటేశ్వర్లు, పద్మారెడ్డి, బద్దం కిషన్, రోషన్‌లాల్‌బోరా, రాజశేఖర్ రెడ్డి, దొంతుల రవి, మీసేవా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు


గొట్టుముక్కలలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

మాక్లూర్ ఏప్రిల్10: మాక్లూర్ మండలం గొట్టుముక్కల గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసినట్టు పశువైద్యాధికారులు డాక్టర్ కిరణ్‌దేశ్‌పాండే, డాక్టర్ ఉమసాహెర్‌లు తెలిపారు. సుమారు 400 పశువులకు టీకాలు వేసినట్టు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది లినిత, మైమద్ పాషా, జైత్రి, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పనులకు ఆకర్షితులయ్యాం '

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్10: భీమ్‌గల్ మున్సిపల్ మాజీ చైర్మెన్ మల్లెల రాజశ్రీ లక్ష్మణ్ బుధవారం లక్కోర లోని ఎస్‌జి ఫంక్షన్ హాల్ లో ఎంపి అభ్యర్థి జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి బాల్కొండ నియోజక వర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నియోజక వర్గంలో పార్టీ పటిష్టతకు పనిచేసే జీవన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా స్వామి

పెద్దబజార్, ఏప్రిల్ 10: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మాదాసు స్వామియాదవ్ రెండవ సారి నియమితులయ్యారు.నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చ కమిటీలో అధికార ప్రతినిదులు స్వామియాదవ్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్ ఒక ప్రకటనలు చేశారు. ఈ సందర్భంగా స్వామియాదవ్ మాట్లాడుతూ ఓబీసీ మోర్చ విభాగం బాధ్యతలు చేపట్టినినాటి నుంచి పార్టీని విస్తృతంగా తీసుకెళ్లేందుకు నరేంద్రమోడీ ప్రభుత్వం ఓబీసీల కోసం తీసుకొచ్చిన పథకాలు ప్రజల్లోకి చేర్చడంతో వవంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ శాసనసభ పక్షనేత యెండల లక్ష్మీనారాయణ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

పనుల చోట కూలీలకు వసతులు కల్పించాలి

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 10: జాతీయుపాదిహామిపథకం పనులచోట కూలీలకు అన్నివసతులు కల్పించాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తచెరువు తాండా గ్రామ శివారుల్లో కొనసాగుతున్న ఉపాదిహామిపథకం పనలను ఆయాన క్షేత్రస్థాయిలో పరిశీలించి కూలీలకు, ఈజీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్‌లకు పలు సూచనలు చేశారు. అంతకు ముమ ఉందు కోనాపూర్, డిసి తాండా గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం నుండి ఉపాది నిమిత్తం రుణాలు పొంది వ్యాపారాలు చేసుకుంటున్న యూనిట్లను, తాగునీటి సరఫరా ట్యాంక్‌లను ఎంపీడీవో పరిశీలించి నీటిసరఫరాను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తెలత్తకుండా ఎప్పటికప్పడు యుద్ధప్రాతిపాదికన తగు జాగ్రత్తలు చేపట్టాలని లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఆయన వెంట గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయితి కార్యదర్శులు ఉన్నారు.

రంజాన్ మాసం చాలా పవిత్రమైనది

బోధన్‌రూరల్‌ఏప్రిల్10: సాలూర మండల కేంద్రంలో ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ మైనారిటీ సోదరులకు రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఇఫ్తార్‌ను ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షల సందర్భంగా వారికి ఫలహారాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనారిటీలకు రంజాన్ మాసం చాలా పవిత్రమైందని, ఎంతో కఠినమైన ఉపవాసాలను పాటిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కేజీ గంగారాం, స్వామిగౌడ్, ఇల్తెపు గంగారాం, దత్తు, శివకాంత్ పటేల్, శివరాజ్ పటేల్, లక్ష్మణ్, రాజేశ్వర్, శ్రీరాం, గంగాధర్, సాలూర షకీల్, యుసుఫ్, ఖదర్‌లతో మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాలెంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

మోర్తాడ్, ఏప్రిల్10: మండలంలోని పాలెం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యా ర్థుల కు సైబర్ నేరాల పై పోలీసులు అవగా హ న కల్పించారు. ఏఎస్సై గోపాల్ మాట్లా డుతూ పాఠశాల విద్యా ర్థులు సైబర్ నేరాలపై, షీటీంలపై అవగాహన కల్పిం చారు. మొబైల్‌ఫోన్ అధికంగా వడకూడదని గుర్తు తెలియని వ్యక్తులు పంపించే సమాచారాన్ని ఎవరికి చేరవేయ వద్దంటు విద్యార్థులకు వివరిం చారు. తమ ఫోన్‌లోకి వచ్చిన ఓటీపీలను ఎవరికి చెప్పవద్దంటు విద్యార్థు లకు తెలిపారు. సైబర్ వలలో చిక్కిన వారు ఎవరైనాఉంటే 1930 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలంటు తెలిపారు. విద్యార్థులకు సైబర్ నేరాలపై పలు ప్రశ్నాలు నిర్వహించగా ఉత్తమ సమాచారం తెలిపిన విద్యార్థులకు మెమోంటోలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వేణుగోపాల్‌రావు, ఉపా ధ్యాయులు మగ్గిడి శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న పోలీసులు

అన్ని వర్గాల అభ్యున్నతే మోదీ లక్ష్యం

● ఎంపీ అర్వింద్

బోధన్‌రూరల్‌ఏప్రిల్10: అన్ని వర్గాల అభ్యున్నతే ప్రధానమంత్రి మోడీ లక్ష్యమని, అవినీతికి దూరం, అభివృద్దే ధ్యేయంగా ప్రధానమంత్రి దేశ ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, నిజాయితీ దేశాన్ని నడిపించేది మోడీనేనని బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. బుధవారం సాయంత్రం బోధన్ పట్టణంలోని బీటీ నగర్‌లో కాలనీవాసులతో కలిసి చాయ్‌పే చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు రేషన్ కార్డులు, ఇళ్లు, ఫ్రీ కరెంట్ రావడం లేదని ఎంపీ అరవింద్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ పార్టీకి గరిబోళ్ల ఉసురు తగులుతుందన్నారు. ఆరు గ్యారంటీలు అని ప్రజలను మోసం చేసిందన్నారు. ఎమ్మెల్యే ఎన్నికలలో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని కాంగ్రెస్ అసత్య ప్రచారం చేసిందని ఇప్పుడు కవిత జైలులో ఉందని ఇదేలా దోస్తీ అవుతుందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ఓవైసీల దోస్తీల ఒక్కటేనని మైనారిటీల ఓట్ల కోసం కాంగ్రెస్ ప్రజలను మభ్య పెడుతుందన్నారు. ప్రజలు అడగని హామీలను బోధన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని మరి ఇప్పుడు తులం బంగారం, అత్త కోడళ్లకు పింఛన్‌లు, రేషన్ కార్డులు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఇకనైనా కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలను నమ్మవద్దని వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని, బీజేపీని గెలిపించాలని ఆయన కోరారు. బంగ్లాదేశీయులు తమ రోహింగ్యాల ఓట్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వారి కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి మోహన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కూరెళ్ల శ్రీధర్, బీజేపీ నాయకులు శంకర్, సుధాకర్ చారి, నరసింహ రెడ్డి, దామోదర్, బాలరాజు, శివసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీజేపీ నాయకులు పసులోటి గోపికిషన్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: పసుపు, మామిడి ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని దీని వల్ల రైతులకు మేలు జరుగుతుందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. బుధవారం ఆర్మూర్ పట్టణంలోని నడిమిగైని మున్నూరుకాపు సంఘం వద్ద బుధవారం హోటల్‌లో చాయ్‌పే చర్చ కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అర్వింద్ పాల్గొని రైతులు, స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాకు పసుపు, జగిత్యాల జిల్లాకు మామిడిని వన్ డిస్ట్రిక్, వన్ ప్రొడక్ట్ కింద ఎంపిక చేశామన్నారు. ఈ రెండు పంటల ఎగుమతులపై కేంద్రం చర్యలు తీసుకుందని, ఇందులో భాగంగానే పసుపును ఇతర దేశాలకు ఎగుమతి చేయడంతో రైతులకు మంచి ధర లభించిందన్నారు. పసుపుబోర్డు వస్తే విత్తనాలు, భూసార పరీక్షలతో పాటు అన్ని అంశాలపై దృష్టి సారిస్తామన్నారు. పరిమితులకు లోబడి ఎరువులను వాడితే పసుపు ఎగుమతులకు డిమాండ్ ఏర్పడి రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దీంతో గోదాంను, పసుపుశుద్ధి కార్మగారాలు, రైతులు వినియోగదారులను కలిపే వ్యవస్థ ఏర్పాటవుతుందన్నారు. దీని వల్ల రైతుల వద్దకే కొనుగోలుదారులు వచ్చి పంటను కొనేలా వ్యవస్థ ఏర్పడుతుందన్నారు. జిల్లా కేంద్రంలో కేవలం ఒకే రైల్వే ఓవర్‌బ్రిడ్జి ఉందని, తాను వచ్చాక ఏడు తీసుకువచ్చానన్నారు. గత ప్రభుత్వం అవినీతి కారణంగానే చక్కెర పరిశ్రమలు తెరుచుకోవడంలేదని ఎంపీ అర్వింద్ విమర్శించారు. తెలంగాణలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు నిజా మాబాద్ అనువైన ప్రదేశమన్నారు. మోదీ ప్రభుత్వం రాక ముందు వరి క్వింటా లుకు రూ.1300 మద్దతు ధర ఉండేదని, ప్రస్తుతం రూ.2వేలు దాటిందన్నారు. నిజామాబాద్ మార్కెట్ యార్డు తెలంగాణలోనే పెద్దదని పసుపు లావాదేవి మీదనే యార్డుకు ఏటా రూ.10 నుంచి రూ.12కోట్ల వరకు ఆదాయం వస్తుందన్నారు. ఈ నిధులను నిజామాబాద్ మార్కెట్ యార్డులో ఖర్చు చేయడంలేదని, కొన్నేళ్లుగా సిరిసిల్ల, సిద్దిపేటకు తరలిపోయాయని ఎంపీ విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీనాయకులు కంచెట్టి గంగాధర్, కలిగోట గంగాధర్, జెస్సు అనిల్, పాలెపురాజు, పుప్పాల శివరాజ్, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, పొల్కం వేణు, అమ్దాపూర్ రాజేష్, విజయానంద్, పులి యుగంధర్, మందుల బాలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


ఆర్మూర్‌లో చాయ్ పే చర్చలో రైతులతో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్


బోధన్‌లో ఛాయ్‌పే చర్చలో భాగంగా మాట్లాడుతున్న ఎంపీ

26 వరకు పునఃప్రవేశ
విద్యార్థులకు ఫీజు చెల్లింపునకు అవకాశం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 10: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2017 సంవత్సరానికి ముందు డిగ్రీలో చేరిన విద్యార్థులు పునః ప్రవేశం పొందిన వారు బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 26 చివరి తేదీ అని అధ్యయన కేంద్ర రీజినల్ కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. రూ.200 అపరాద రుసుముతో మే 6 వరకు చెల్లించవచ్చని ఒక్కో పేపర్‌కు రూ.150 చొప్పున ఆన్‌లైన్ కేంద్రాల్లో చెల్లించాలని ఆమె తెలిపారు. 1వ సంవత్సరం పరీక్షలు మే 17 నుంచి 20 వరకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మే 17 నుంచి 22 వరకు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మే 24 నుంచి 29 వరకు మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

సైబర్ నేరాలపై ఖాతాదారులకు అవగాహన



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఇందల్వాయి, ఏప్రిల్ 10: ఇందల్వాయి మండలంలోని గన్నారం గ్రామంలోగల తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతాదారులకు సైబర్ నేరాలపై బుధవారం పోలీసులు అవగాహన కల్పించారు. ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు ధాన్యం అమ్ముకుంటున్నందున కొందరు సైబర్ నేరగాళ్లు ఓటీపీ చెప్పమని సైబర్ నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నందున గుర్తుతెలియని వారికి ఎలాంటి ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్, ఇందల్వాయి పోలీసులు తదితరులు ఉన్నారు.

బీఎస్ రాములు కథల పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న డీఈవో

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 10 :డాక్టర్ దండు అన్నందాస్ జ్యోతి శివ కుమార్ పెద్దవాల్గోట్ రచించిన బీఎస్ రాములు కథలు తెలంగాణ జనజీవన చిత్రణ పుస్తకాన్ని బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్, డాక్టర్ లక్ష్మణ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత జ్యోతి మాట్లాడుతూ తెలుగు భాష పట్ల శ్రద్ధ ఆసక్తిని వినూత్న రీతిలో తనదైన శైలిలో అమితాసక్తిని పెంపొందించడానికి ప్రయోగాత్మకంగా ఈ మొదటి పుస్తకాన్ని రాయడం జరిగిందన్నారు.ఈకార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్, శంకర్, శ్రీనివాస్‌రావు, కొండ ఆశన్న, మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

బడా రాంమందిర్‌లో అన్నదానం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 10 :నగరంలోని గాజుల్‌పేట్‌లోని శ్రీబడా రాంమఠ్‌లో శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లనుచేస్తున్నారు. పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అన్నదాన కార్యక్రమాలను కూడా ప్రారంభించారు.మందిరంలో బుధవారంప్రారంభమైన కార్యక్రమంలో ఫిట్ పర్సన్ వేణు, పాటు బ్రాహ్మణసేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

మద్దతు ధరలతో పాటు బోనస్‌ను చెల్లించాలి



మాట్లాడుతున్న నాయకులు

పెద్దబజార్, ఏప్రిల్ 10:పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాను ఏర్పాటు చేసి మద్దతు ధరలతో పాటు బోనస్ ధరలను చెల్లించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు కోశేశ్వరరావు, సీనియర్ నాయకులు ఆకుల పపాయ్య, డిమాండ చేశారు. బుధవారం నగరంలోని అర్సపల్లిల ఏఐఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వార మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలు అమలు పర్చడం లేదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 7వేల పైచిలుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధురకు రైతులు ధా న్యాన్ని కొంట ఆమని హామీ ఇచ్చిన ఇప్పటి వరకు ఇంకా పూర్తిస్థాయిలో కేంద్రాలను తెరవకపోవడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ంద్రాల్లో భోజన సౌకర్యం, నీడ, నీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. కాం గ్రెస్ మద్దతు ధరలతో పాటు రైతుకు రూ.500 భోనస్‌ను చెల్లింస్తామని చెప్పిన ఎక్కడ చెల్లించం లేదని వెంటనే ఈ సీజన్ నుంచి భోనస్ విగాన్నా వారు డిమాండ్ చేశారు. ఈనెల 10 నుంచి 20 మరకు మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ఆందోళనకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న, వేల్పూర్ భూమయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ సోదరలకు ఇఫ్తార్ విందు

సిరికొండ ఏప్రిల్ 10: సిరికొండ మండలం కొండాపూర్ గ్రామంలో బుధవారం ఉపవాస దీక్షలో ఉన్న మైనార్టీ సోదరలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోష్‌నాయక్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు భూక్య సంతోష్‌నాయక్ విందే ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కరీంభాయ్, కాసీం బాయ్, హాలా తదితరుతు పాల్గోన్నారు.

సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతుల వినతి

కోటగిరి,ఏప్రిల్10: కోటగిరి మండల కేంద్రంలో సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సునీతకు వినతిపత్రం సమర్పించారు. గత సంవత్సరం కోటగిరి మండల కేంద్రంలో పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఆరుతడి పంటలను సాగు చేసిన తమకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని రైతులు వాపోయారు. పంట చేతికి వచ్చి 20రోజులు కావస్తున్న కొనుగోలు కేంద్రం లేకపోవడంతో తరుగు వస్తుందని వాపోయారు. తక్షణమే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



కోటగిరిలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

ఈ కార్యక్రమంలో రైతులు పోశెట్టి, అశోక్, శంకర్, గంగులు, మాల కొండ రెడ్డి, సాయిలు, గజేందర్, నర్సింలు, లింగురాం పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్స్‌పాల్‌గా శ్రీనివాస్ నియామకం

సిరికొండ ఏప్రిల్ 10 : సిరికొండ ఆదర్శ పాఠశాల(మోడల్ స్కూల్) ప్రిన్స్‌పాల్‌గా సీనియర్ ఉపాన్యాసకులు శ్రీనివాస్ పాలను ప్రభుత్వం నియామించడంతో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. పాఠశాల ప్రారంభమయిన నాటి నుంచి మొన్నటి వరకు ప్రిన్స్‌పాల్‌గా బాధ్యతలు నిర్వర్తించిన సునీతాను విద్యాశాఖ బాధ్యతల నుంచి తప్పించడంతో శ్రీనివాస్ నియామకం తప్పని సరి పరిస్థితులు ఏర్పడ్డాయి. వాస్తవానికి గత కొన్నేళ్లుగా పాఠశాలలో పరిస్థితులు చేయిదాటడంతో విద్యాశాఖ అధికారులకు సునీతను మార్చక తప్పని స్థితి ఏర్పడ్డది. సునీత పదో తరగతి విద్యార్థిని చితక బాదిన విషయంలో సిరికొండలో కేసు నమోదు అయిని విషయం విదితమే. అలాగే పాఠశాలలో సునీతకు ఉపాన్యాసకులు, ఉపాధ్యాయులకు మధ్య పూడ్చని అగాతం ఏర్పడ్డది.



ఆదర్శ పాఠశాలల ప్రిన్స్‌పాల్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ పాల

'మోదీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది'

పెద్దబజార్, ఏప్రిల్ 10: రైతు పోరాటంపై మోదీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టీస్ చంద్రకుమార్ అన్నారు. బుధవారం నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు పండించే పంటలకు స్వామినాథన్ కమీషన్ ప్రకారం చట్టబద్ధత కల్పించాలన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరను కల్పించాలని డిల్లీ కేంద్రంలో రైతులు పోరాడుతున్నారని అన్నారు. రుణాలు తీసుకున్న రైతుల హక్కులు అన్ని మాఫీ చేయాలని అప్పుల బాధతో ఏ రైతు ఆత్మహత్య చేసుకున్న ప్రతి కుటుంబానికి రూ.10లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. ప్రతి పంటలకు పంటల భీమా సౌకర్యం కల్పించి నష్టపోయిన ప్రతిరైతుకు భీమా సౌకర్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ



మాట్లాడుతున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్

సాధన కమిటీ కన్వీనర్ గోవర్ధన్, నాయకులు రఘునాథ్, ప్రభతు, దేశెట్టి సాయారెడ్డి పాల్గొన్నారు.

కోటగిరిలో రంజాన్ తోఫాల పంపిణీ



కోటగిరిలో రంజాన్ తోఫాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కోటగిరి,ఏప్రిల్10: కోటగిరి మండల కేంద్రంలో బుధవారం పేద మైనారిటీ కుటుంబాలకు మండల మాజీ కోఆప్షన్ సభ్యులు హమీద్ రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. గ్రామంలో 30మంది నిరుపేదలకు తనవంతు సాయంగా తోఫాలను అందించారు. రంజాన్ పండుగను ముస్లింసోదరులు ఘనంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొట్టం మనోహర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షహీద్, నాయకులు బర్ల మధుకర్, అబ్దుల్ వాజీద్, మసూద్, నజీర్, ఇమ్రాన్, డాక్టర్ సాజిద్, గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

యంచలో సుదర్శన హోమం

నవీపేట,ఏప్రిల్10: మండలంలోని యంచలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం సుదర్శన హోమం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ దంపతులు కిరణ్, రమ్యశీల ఆధ్వర్యంలో నూతనంగా ఆలయ ప్రాంగణంలో గోశాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సుదర్శన హోమం, నరసింహ యాగం, వేంకటేశ్వర స్వామి పూజ, గోపూజ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యంచలోని శ్రీ ఓం ఆదిశక్తి ట్రస్ట్ ఆలయ వ్యవస్థాపకురాలు స్వర్ణ కమల లక్ష్మి, గోకుల్ గోసేవ సమితి సభ్యులతో పాటు ప్రవీణ్ కుమార్, భూమన్న, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నవీపేట,ఏప్రిల్10: మండలంలోని అనంతగిరిలో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని బస్టాండ్ సమీపంలో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి శ్రావణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి పాపేశ్వర్ రావు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం

ముప్కాల్, ఏప్రిల్10: భారత రాజాంగ నిర్మాణంలో బీఆర్. అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని తపస్ జిల్లా అధ్యక్షురాలు పరళి కృష్ణవేణి అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ముప్కాల్ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో భాగంగా సేవా దివాస్ కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ జీవితంలో జరిగిన ముఖ్యమైన సంఘటనలను విద్యార్థులకు వివరించారు. అంతకు ముందు విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధానకార్యదర్శి బట్టు బద్రీనాథ్, ఒడ్నాల శ్రీనివాస్, బాల్కొండ అధ్యక్ష, కార్యదర్శులు మగ్గిడి రాజేందర్, రాజ్యలక్ష్మీ, ముప్కాల్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శి సుంకం రవికుమార్, రాజనర్సయ్య, మెండోర మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శి రమాదేవి, జ్యోతి, రాష్ట్ర టెక్నికల్ ఇన్‌చార్జీ శ్రీరుద్ర మధుసూన్, పాఠశాల హెచ్ఎం గంగారాం, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'ప్రతీ గ్రామంలో 175 మంది కూలీలు పనిచేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీవో


దర్పల్లి, ఏప్రిల్ 10 :మండలంలోని ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో 175 మంది కూలీలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బాలకృష్ణ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 175 మంది కూలీలు ఉండే విధంగా చూడాలన్నారు. పనులు జరిగే చోట తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టెంట్లు సౌకర్యం కల్పించాలని సూచించారు. ప్రతి కూలీకి 300 చెల్లిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కూలీల సంఖ్య తగ్గితే చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వినోద, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సీజ్ చేసిన పీడీఎస్ బియ్యం వేలం

ఇందల్వాయి, ఏప్రిల్ 10 :ఇందల్వాయి మండలంలోని వివిధ గ్రామాలలో ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పోలీసులు రైడ్ చేసి పట్టుకొని సీజ్ చేసిన పీడీఎస్ బియ్యం 77 క్వింటాల 86 కిలోలు ఈనెల 16వ తేదీన 11గంటలకు వేలం వేయనున్నట్లు తహశీల్దార్ వెంకట్రావు తెలిపారు. సివిల్ సప్లై అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడుల్లో ఇటీవల గన్నారం, ఇందల్వాయి తదితర గ్రామాల్లో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని అమ్ముతున్న వారిని పట్టుకొని వారిపై కేసు నమోదు చేసి బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈనెల 16వ తేదీన శ్రీసాయిరాం రైస్‌మిల్ సాంపల్లి వద్ద 11గంటల సమయంలో వేలం వేస్తున్నట్లు తెలిపారు.

విద్యా సంవత్సరం ప్రారంభానికి అన్ని పనులు పూర్తి చేయాలి


ఏర్గట్ల, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధ వారం ఎంఈవో ఆంధ్రయ్య మండలంలోని పన్నెండు ఆదర్శ పాఠశాలలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులతో పాటు వీవో అధ్యక్షులతో వర్క్‌షాప్‌పై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ శాలలో వాటర్, మరుగుదొడ్లు, మైనర్ రిపేర్స్, విద్యుత్ అసౌకర్యాలను గుర్తించి వచ్చే విద్యా సంవత్సరానికి పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శివచరణ్, ఐకేపీ ఏపీఎమ్ శ్యామ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏర్గట్లలో మాట్లాడుతున్న ఎంఈవో

నాగంపేట్ ఆలయంలో అన్నదానం

ముప్కాల్, ఏప్రిల్10: ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామంలో ఉగాధి పర్వదినం పురస్కరించుకొని బుధవారం ఉత్సవాల్లో భాగంగా వెంకటేశ్వరస్వామి ఆలయంలో జాతర ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో ఉత్సవమూర్తులకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దీక్షస్వాములు, మాలధారణ స్వాములు దీక్షను విమరింపజేశారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

విశ్వబ్రాహ్మణ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

నవీపేట,ఏప్రిల్10: మండలంలోని బినోలలో బుధవారం విశ్వబ్రహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక దుర్గామాత మందిరంలో ఈ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా కత్రోజి రాజేశ్వర్, ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా భూమయ్య, కోశాధికారిగా అక్కుంపల్లి రాజు, సలహాదారులుగా దయానంద్‌లను ఎన్నుకున్నారు.

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బండారి యాదగిరి

ఆర్మూర్‌టౌన్ , ఏప్రిల్10: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన బండారి యాదగిరి ఓబీసీమోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించడంతో కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన యాదగిరిని హర్షం వ్యక్తం చేస్తూ తన ఎన్నికకు సహకరించిన ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారిలకు ధన్యవాదాలు తెలిపారు.

కాంతి హైస్కూల్‌లో ఘనంగా కన్వకేషన్ డే

పెర్కిట్, ఏప్రిల్10: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కాంతి హైస్కూల్‌లో కన్వకేషన్ డే ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కాంతి గంగారెడ్డి మాట్లాడుతూ గతంలో డిగ్రీ పూర్తయినప్పుడు నిర్వహించుకునే వేడుకలను పాఠశాల వయస్సులోనే నిర్వహించడం వల్ల తమ లక్ష్యాన్ని సాధిస్తే ఉండే అనుభూతి పిల్లలకు పరిచయం చేసినందుకు గాను కన్వకేషన్ డే నిర్వహిస్తున్నామన్నారు. ఇటువంటి కార్యక్రమాలు మాపాఠశాలలో నిర్వహిస్తూ ఉంటామని తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

ఈద్గాలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్10: గురువారం జరిగే రంజాన్ పండగను పురస్కరించుకొని మున్సిపల్ కమిషనర్ రాజు బుధవారం ఈద్గాలను పరిశీలించారు. పట్టణంలోని జిరాయత్‌నగర్, నిజామాబాద్‌రోడ్, పెర్కిట్‌లలోని ఈద్గాలలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆయన వెంట సానిటరి ఇన్స్‌పెక్టర్ మహేష్, ఏఈ రఘు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

సిరికొండ ఏప్రిల్ 10 : సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్‌రెడ్డి పరామర్శించి ఐదువేల ఆర్థిక సమాయాన్ని అందజేశారు. గడ్కోల్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంలో ఆటో రాజేశ్వర్ తండ్రి పెద్ద రాజన్న మరణించడంతో బాస్కర్‌రెడ్డి బుధవారం పరామర్శించి ధైర్యాన్ని కల్పించారు. రాజేశ్వర్ కుటుంబానికి తన వంతుగా ఐదువేల ఆర్థిక సహాయాన్ని బాస్కర్‌రెడ్డి అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ నాయకులు రాంచంద్రరెడ్డి,సంతోష్‌రెడ్డి., మాజీ ఎంపటీసీ సభ్యులు లింబాద్రి,హేమంత్,భానుచందర్,రమేష్‌రెడ్డి,కోచర్,బసంత్‌రెడ్డి, బాస్కర్‌రెడ్డి,కట్ట బాలయ్యసుమన్,హరీష్ తదితరులు పాల్గోన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 10 : అనాథలు, ఇతర నిరాశ్రయులైన పిల్లలు, బాలల గృహాల పిల్లలు, అక్రమ రవాణాకు గురైన పిల్లల నుంచి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల హైదరాబాద్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ దివ్యాంగుల వయోవృద్ధుల శాఖ అధికారిణి రసూల్‌బీ ఒక ప్రకటనలో కోరారు. అనాధలు, పాక్షిక అనాధలు, ఇతర నిరాశ్రులైన పిల్లలు, బాలల గృహాల పిల్లలు, అక్రమ రవాణాకు గురైన పిల్లలు దరఖాస్తు చేసుకునే వారు బాల సదనం, శిశుగృహ సుభాష్‌నగర్ నందు తగిన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుల, ఆదాయ, పదవ తరగతి, స్టడీ సర్టిఫికెట్, ఇతర సర్టిఫికెట్లతో మే 6వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.170	రూ.300	రూ. 320
వెన్‌కాబ్(కిలో)	: రూ.175	రూ.305	రూ. 325



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74,000	రూ.68,200	రూ.850

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మైదాన్ (హిందీ) (9.15)
: ఫ్యామిలీ స్టార్ (1.05, 10.30)
: టిల్లు స్క్వేర్ (4.30, 7.30)
స్క్రీన్-2 : బడే మియాన్ చోటే మియాన్ (తెలుగు) (10.00, 7.05)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (1.30)
: గీతాంజలి మళ్లీ వచ్చింది (4.05)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ 3డీ) (10.35)
స్క్రీన్-3 : లవ్‌గురూ (10.15, 7.15)
: మంజుమ్మల్ బాయ్స్ (1.25, 4.20)
: గీతాంజలి మళ్లీ వచ్చింది (10.25)
స్క్రీన్-4 : లవ్‌గురూ (12.40)
: మైదాన్ (హిందీ) (3.45, 10.10)
: శ్రీరంగనీతులు (7.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : గీతాంజలి మళ్లీ వచ్చింది (10.40)
: టిల్లు స్క్వేర్ (1.30, 10.40)
: ఫ్యామిలీ స్టార్ (4.20, 7.30)
స్క్రీన్-2 : లవ్ గురు (10.30, 10.30)
: గీతాంజలి మళ్లీ వచ్చింది (1.30, 7.35)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ) (4.30)
స్క్రీన్-3: మైదాన్ (హిందీ) (1.20, 7.20)
: మంజుమ్మల్ బాయ్స్ (4.45)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ) (10.45)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : ఫ్యామిలీ స్టార్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : బడే మియాన్ చోటే మియాన్ (హిందీ) (11.00, 6.00)
: మైదాన్ (హిందీ) (2.00, 9.00)
విజయ్ : గీతాంజలి మళ్లీ వచ్చింది (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్